పిక్నిక్‌కు పోదాం రండి

వన భోజనాలకు కేరాఫ్ తూర్పు నియోజకవర్గం • కార్తీక మాసంలో కళకళలాడనున్న పిక్నిక్ స్పాట్‌లు

• కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి విహార యాత్రలు • ఆహ్వానం పలుకుతున్న అనేక పార్కులు • అటు విందు.. ఇటు దిల్ పసందు



కార్తీక మాసం రాగానే నగరవాసులు వన భోజనాలకు వెళ్తుంటారు. ఇందుకోసం దూర ప్రాంతాలకు పోవాల్సిన అవసరం లేదు. విశాఖ తూర్పు నియోజకవర్గం పిక్నిక్ స్పాట్‌లకు ప్రసిద్ధి గాంచింది. దీని పరిధిలోనే ప్రముఖ పర్యాటక కేంద్రాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ఇవి దశాబ్దాల తరబడి పిక్నిక్ స్పాట్‌లుగా విశాఖవాసులకు పరిచయమైనవే. కైలాసగిరి, ముడసర్లోవ పార్కు, తెన్నేటి పార్కు, వీఎంఆర్‌డీఏ(వుడా) పార్కు, శివాజీ పార్కు, కంబాలకొండ, జూ పార్కు మొదలనైవి పేరొందిన పిక్నిక్ స్పాట్‌లుగా నిలిచాయి. కార్తీక మాసంలో ఇవన్నీ సందర్శకులతో కళకళలాడుతుంటాయి. వాటిలో పిల్లల ఆటలకు, పెద్దల సమావేశాల నిర్వహణకు సౌకర్యాలతోపాటు వినోదం అందుబాటులో ఉంటుంది. ఈ కార్తీక మాసంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు ఈ పిక్నిక్ స్పాట్‌లన్నీ ఆహ్వానం పలుకుతున్నాయి. వాటి విశేషాలు ఏంటో ఓ లుక్కేద్దాం..

– ఆరిలోవ

మురిపించే ముడసర్లోవ పార్కు



ఆరిలోవ ప్రాంతం బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకుని చుట్టూ పచ్చదనంతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ముడసర్లోవ పార్కు ఉంది. రిజర్వాయర్ పక్కన పచ్చని కొండల నడుమ ఉన్న ఈ పార్కుకు బ్రిటిష్ కాలం నాటి చరిత్ర ఉంది. పిల్లల కోసం ఆట పరికరాలు, సామూహిక వనభోజనాలకు విశాల మైదాన ప్రాంతాలున్నాయి. ఈ పార్కు లోపల నుంచి ఎత్తయిన గట్టుపైకి వెళ్తే రిజర్వాయర్ అందాలు కలనిపిస్తాయి. ప్రస్తుతం దీన్ని జీవీఎంసీ నిర్వహిస్తోంది. ప్రవేశ రుసుం రూ.10. 12 ఏళ్ల లోపు పిల్లలకు ఉచితం.

ఆహ్లాదకరమైన తెన్నేటి పార్కు



కైలాసగిరి కొండ చివరన బీచ్ రోడ్డును ఆనుకొని వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో తెన్నేటి పార్కు ఉంది. దీనిలో విశాలమైన పచ్చికతో కూడిన మైదాన ప్రాంతాలు, పిల్లల ఆటపరికరాలు, బెంచీలు, ఇతర సౌకర్యాలున్నాయి. దీని దిగువన సముద్రం అలలతో సందడిగా ఉంటుంది. ఇక్కడే తీరానికి కొట్టుకొచ్చిన బంగ్లాదేశ్‌కు చెందిన పెద్ద ఓడ సందర్శకులను ఆకట్టుకుంటుంది. ఇది ఫొటో స్పాట్‌గా నిలిచింది. తెన్నేటి పార్కు ప్రవేశ ఉచితం.

నగర మణిహారం కైలాసగిరి



నగర పర్యాటక ప్రాంతాల్లో కైలాసగిరి మణిహారంగా నిలిచింది. సముద్ర తీరాన ఎత్తయిన కొండపై ఈ పార్కును వీఎంఆర్‌డీఏ(వుడా) ఏర్పాటు చేసింది. కార్తీక మాసంలో ఎక్కువమంది దీన్ని సందర్శిస్తుంటారు. ఇక్కడ ప్రశాంత వాతావరణం, ఆహ్లాదకరమైన సముద్ర గాలులు ప్రత్యేకం. ఈ కొండపై నుంచి సందర్శకులు సముద్రం అలలను ఆస్వాదించవచ్చు. ఇక్కడ శివపార్వతుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిల్లలు ఆటలకు పచ్చని మైదానాలు, వనభోజనాల కోసం విశాల మైదాన ప్రాంతాలు, పచ్చిన చెట్లు ఎన్నో ఉన్నాయి. 3డీ, 9డీ పిక్చర్లు ప్రదర్శించే హాల్ ఉంది. తెలుగు మ్యూజియం ఇక్కడ మరో ఆకర్షణీయమైంది. నక్షత్ర శాల, రొటేట్ చైర్లతో సందర్శకులకు మరింత వినోదం కలుగుతుంది. గిరిపై నిర్వహిస్తున్న సర్క్యూట్ ట్రెన్ ద్వారా నగర అందాలు చూడవచ్చు. అప్పుఘర్ వద్ద ప్రైవేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోప్‌వే కేబుల్ కార్ ద్వారా నగర అందాలను వీక్షిస్తూ కైలాసగిరిపైకి చేరవచ్చు.

ఎన్నో ప్రత్యేకతల వీఎంఆర్‌డీఏ పార్కు



నగరంలోని వీఎంఆర్‌డీఏ(వుడా) పార్కు పేరు చెప్పగానే పిల్లలు ఎగిరి గెంతేస్తారు. ఇందులో పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కు ఉంది. స్కేటింగ్ రింగ్, పచ్చని మైదానాలు, ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్‌లు దీని సొంతం. ఇది సముద్రం ఒడ్డున ఉండటంతో పార్కులో గడుపుతూ తీర అందాలను తిలకించవచ్చు. బోటింగ్, యోగా కేంద్రాలు ఇక్కడ ప్రత్యేకం. ఆర్కే బీచ్ పక్కన ఇది ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. వనభోజనాలకు వెళ్లే వారు ఇక్కడ రోజంతా ఎంజాయ్ చేయవచ్చు. పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 ప్రవేశ రుసుం చెల్లించాలి.

విశాలమైన శివాజీ పార్కు



ఎంవీపీ కాలనీ, శివాజీ పాలెం మధ్యలో నిర్మించిన శివాజీ పార్కును జీవీఎంసీ నిర్వహిస్తోంది. దీని లోపల విశాల మైదానాలు, పిల్లల ఆటపరికరాలు, పెద్దల షెల్టర్లు ఉన్నాయి. వాటర్ ఫౌంటైన్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. చిన్నారుల బర్త్‌డే ఫొటోషూట్‌లు ఇక్కడ ఎక్కువగా జరుగుతాయి. పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5 ప్రవేశ రుసుం. ఈ పార్కు నగరం మధ్యలో ఉండటంతో పిక్నిక్‌లకు అనుకూలమైనదిగా నిలిచింది.

కనువిందు చేసే జూ పార్కు



ఇందిరాగాంధీ జూ పార్కులో వందల కొలది జాతులకు చెందిన వివిధ రకాల జంతువులు, పక్షులు సందర్శకులను కనువిందు చేస్తాయి. నగరంలో హైవే పక్కనున్న సహజ సిద్ధమైన ఈ పార్కులో వన్యప్రాణులతోపాటు విశాలమైన మైదాన ప్రాంతాలున్నాయి. పార్కు చుట్టూ పచ్చదనంతో నిండిన కొండలు ఆహ్లాదాన్నిస్తున్నాయి. జూ లోపల బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. జూ ప్రవేశ రుసుం పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.30, కారుకు రూ.700(అందులో ఎంతమంది ఉంటే అందరూ టికెట్లు తీసుకోవాలి).

ఎకో టూరిజం స్పాట్.. కంబాలకొండ



జూ పార్కు ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కంబాలకొండ మరో చక్కని పిక్నిక్ స్పాట్. విశాల మైదానాలు, చుట్టూ గొలుసుకట్టు కొండలతో పచ్చదనం ఇక్కడ ఉట్టిపడుతోంది. సుమారు 265 ఎకరాల విస్తీర్ణంలో అటవీ శాఖ అధికారులు ఇక్కడ ఎకో టూరిజం పార్కు తయారు చేశారు. వందల మంది వన భోజనాలు చేసుకునేందుకు ఇక్కడ అనుకూలం. ప్రతి ఏటా కార్తీక మాసంలో పలు యూనియన్లు, కుటుంబాల సముదాయాలు, విద్యా సంస్థలు ఇక్కడ వనభోజనాలు నిర్వహిస్తుంటారు. ఇందులో 2, 3, 5 కిలోమీటర్ల ట్రెకింగ్ కూడా ఉంది. పిల్లల ఆట పరికరాలు, బర్మా బ్రిడ్జి, జిప్‌లైనర్, గోట్‌వాక్, వాక్ తదితర ఈవెంట్స్ సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.20 ప్రవేశ రుసుం చెల్లించాలి. రూ.1,000 చెల్లించి కారుతో కంబాలకొండ పార్కులోకి వెళ్లవచ్చు.

వ్యాయామంపై నగరవాసుల ఆసక్తి



బీచ్ రోడ్డులో స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు



బీచ్ రోడ్డులో వాకింగ్ చేస్తున్న నగర వాసులు

ఏయూక్యాంపస్: నగర ప్రజల్లో ఆరోగ్యాభిలాష పెరుగుతోంది. కాస్త విరామం దొరికితే వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. దీనికి నిదర్శనమే వారాంతంలో బీచ్ రోడ్డుకు పెద్ద సంఖ్యలో నగరవాసులు తరలి రావడం. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు వందలాది మంది నగరవాసులు వ్యాయామం చేయడానికి వస్తున్నారు. నిమిషం కూడా వృథా చేయకుండా వీరంతా వాకింగ్, జాగింగ్, రన్నింగ్, సైక్లింగ్ చేయడంలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. కొంత మంది యోగా, మెడిటేషన్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. యోగా విలేజ్ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో సైతం మహిళలు, పురుషులు వ్యాయామాలు చేస్తున్నారు. నాలుగైదేళ్ల చిన్నారుల నుంచి ఎనిమిది పదులు దాటిన వృద్ధులు సైతం నిత్యం బీచ్ రోడ్డులో వ్యాయామం చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. శని, ఆదివారాల్లో బీచ్‌కు వచ్చే నగరవాసుల సంఖ్య మరింత పెరుగుతోంది. మొత్తం మీద ప్రజల్లో ఆరోగ్యాభిలాష పెరిగి, శారీరక వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు.

పర్యాటక ప్రాంతాల్లో సహజసిద్ధమైన పుట్టలు



ముడసర్లోవ పార్కులో పాముల పుట్ట



కంబాలకొండలో పుట్ట వద్దకు వెళ్లడానికి సిద్ధం చేసిన దారి

ఆరిలోవ: ఆరిలోవతోపాటు పర్యాటక ప్రాంతాల్లో సహజసిద్ధమైన పుట్టలు కోకొల్లలుగా ఉన్నాయి. సాధారణంగా నాగులచవితి పర్వదినాన భక్తులు నాగన్నకు పూజలు చేస్తుంటారు. ఈ నెల 5న నాగులచవితి సందర్భంగా భక్తులు సిద్ధమవుతున్నారు. నగరంలోని నివాసాల మధ్య కృత్రిమ పుట్టలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అందుబాటు లో ఉన్న వారు వాటి వద్దే పూజలు చేస్తుంటారు. ఆరిలోవ, ముడసర్లోవ, విశాఖ వ్యాలీ, హనుమంతవాక, జోడుగుళ్లపాలెం తదితర ప్రాంతాలతోపాటు కంబాలకొండ, ముడసర్లోవ, జూపార్కు, కైలాసగిరి పార్కుల్లో సహజ సిద్ధమైన పుట్టలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా పార్కుల్లో నిర్వాహకులు, అధికారులు పుట్టల చుట్టూ శుభ్రం చేయించారు. భక్తులు వాటి వద్దకు చేరుకొని నాగన్నకు పూజలు చేసుకోవడానికి వీలుగా దారులు చేశారు. పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించారు.

తొలి సోమవారం పూజలకు సిద్ధం



దుర్గామల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల విగ్రహం



లలితా పీఠంలో పరమేశ్వరుడు

ఏయూక్యాంపస్: కార్తీక మాసం తొలి సోమవారం పూజలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. చినవాల్తేరు కనకమ్మ ఆలయ ప్రాంగణంలోని దుర్గామల్లికార్జున స్వామి ఆలయం ప్రత్యేక పూజలకు ముస్తాబైంది. కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజుల్లో రుద్రాభిషేకాలు జరపనున్నారు. కార్తీక దీపం, ఆకాశ దీపం పెట్టడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు జరిపించుకోనున్నారు. కిర్లంపూడి లేఅవుట్‌లోని లలితా సుందరేశ్వర పీఠాన్ని అందంగా అలంకరించారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరుపుతున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కాండూరి లక్ష్మణస్వామి తెలిపారు. బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయంలోని శివాలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు.



తొలి కార్తీక సోమవారం పూజలకు ముస్తాబైన దుర్గామల్లికార్జున ఆలయం

వేమన మందిరంలో రెడ్డి వివాహ పరిచయ వేదిక



మాట్లాడుతున్న వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వివేకానందరెడ్డి

సీతమ్మధార: ఆశీలమెట్టలో గల వేమన మందిరంలో రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, ఈస్ట్ గోదావరి జిల్లాల నుంచి రెడ్డి కుటుంబాలు పాల్గొన్నాయి. వధువు, వరుడు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు ఈ సందర్భంగా సేకరించుకున్నారు. వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఉచిత రెడ్డి వివాహ పరిచయ వేదిక నిరంతర సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, కోశాధికారి ఎస్.బాలిరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు నీలాపు రమణారెడ్డి, పులగం సూర్యనారాయణరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు



ఎంవీపీ కాలనీ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–5లోని అల్ మదీనా మసీద్‌లో ఆదివారం మిలాద్(గ్యార్వీ షరీఫ్) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముంబైకు చెందిన బోధకుడి ఆధ్వర్యంలో ముస్లింలంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీద్ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు జాఫర్ అబ్బాస్ రహీ, కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ జాఫర్, మౌలానా ముఫ్తీ ఖయ్యూమ్, మీర్ అబ్బాస్ హుస్సేన్, మాజీ ఆర్డీవో ఖాన్, యూత్ ప్రెసిడెంట్ మదీనా, ఇతర మసీదులకు చెందిన ఇమామ్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యసాయి సేవా సంస్థల రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సత్యసాయి భక్తులు

ఎంవీపీకాలనీ: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, శ్రీ సత్యసాయి సేవా సమితి, శ్రీసత్యసాయి నగర సేవా సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ప్రేమ సదన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. భారీ ఎత్తున నగర వాసులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు ప్రారంభించారు. 34 మంది భక్తులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.నాయుడు, రోటరీ క్లబ్ చైర్మన్ కె.వి.శ్రీనివాస్, మాజీ చైర్మన్ జి.ఎస్.రాజు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ప్రభాకర్, రామినాయుడు, శివాజీ, రామకృష్ణరావు, జ్యోతి, నాగవేణి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎన్‌బీ సిబ్బంది వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ కార్యాలయం సిబ్బంది

ఏయూక్యాంపస్: విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ కార్యాలయం సిబ్బంది ఆదివారం బీచ్ రోడ్డులో వాకథాన్ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద బ్యాంక్ సిబ్బంది అవినీతికి వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో పీఎన్‌బీ విశాఖ సర్కిల్ హెడ్ వి.నీలిమ, స్థానిక బ్రాంచ్ కార్యాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ఆరిలోవ: ఆరిలోవలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. ఆరిలోవ టీఐసీ పాయింట్ హిందీ భవన్ ఎదురుగా రోడ్డు పక్కన పార్వతమ్మ తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తుంటుంది. అదే ప్రాంతానికి చెందిన బెల్లాన కోటేశ్వరరావు(66), అతడి భార్య ఆదివారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్లొచ్చి పళ్లు కొనేందుకు బండి వద్ద నిల్చున్నారు. అదే సమయంలో దుర్గాబజార్ వైపు నుంచి ఓ కారు అతివేగంతో వస్తూ పండ్ల బండిని బలంగా ఢీకొట్టింది. బండితోపాటు పండ్ల వ్యాపారి పార్వతమ్మ, కోటేశ్వరరావు, అతని భార్యను కూడా ఢీకొనడంతో వారంతా రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో వెంటనే వైద్య సిబ్బంది చేరుకొని ముగ్గురినీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కోటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య, పండ్ల వ్యాపారి పార్వతమ్మ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కారును స్టేషన్‌కు తరలించి డ్రైవ్‌చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడు కోటేశ్వరరావు జీవీఎంసీ రిటైర్డ్ డీఈ. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

బీచ్ రోడ్డులో పేరుకుపోతున్న వ్యర్థాలు



వ్యర్థాలతో నిండిన డస్ట్ బిన్

ఏయూక్యాంపస్: సాగరతీరంలోని పాండురంగపురానికి చేరువలో నిత్యంవ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఉదయాన్నే బీచ్ రోడ్డుకు వచ్చే వాకర్లకు ఇవి ఇబ్బందికరంగా మారాయి. డస్ట్ బిన్‌లు నిండిపోయి వ్యర్థాలు బయట పడేయడం ఇక్కడ సర్వసాధారణ విషయమైంది. వీధికుక్కలు చెత్తను నోట కరచుకుని వెళ్లిపోతున్నాయి. బీచ్ రోడ్డులో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది.

యువత మత్తుకు బానిస కావద్దు



క్రికెట్ టోర్నీ విజేతలకు ఉపకార్ కప్ అందజేస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: యువత మత్త పదార్థాలకు బానిస కాకూడదని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హితవు పలికారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరిలోవలో రెండు వారాలుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను ముఖ్య అతిథి సీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు తరపున కంచర్ల అచ్యుతరావు అందిస్తున్న సేవలను కొనియాడారు. క్రీడలను ఆయన ప్రోత్సహిస్తూ యువతకు సహకరించడం అభినందనీయమన్నారు. నేటి యువత ఎక్కువగా గంజాయి, మద్యపానానికి బానిసలై మానసిక రోగులుగా మారుతున్నారన్నారు. వారి వల్ల సమాజంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ట్రస్టు వ్యవస్థాపకుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ తన పెద్ద కుమారుడు యశ్వంత్ జయంతి సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. విన్నర్‌కు రూ 1.20 లక్షలు, రెండో స్థానం వారికి రూ.60 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీలు అందించినట్లు చెప్పారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రమాదకరంగా హోర్డింగ్



పడిపోయిన హోర్డింగ్ బోర్డు పలకలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో స్విమ్మింగ్ పూల్(ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్) బయట ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ తుప్పుపట్టి ప్రమాదకరంగా మారింది. చాలా కాలంగా దీని నిర్వహణ, వినియోగం పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో ఇది తుప్పు పట్టిపోతోంది. ఇప్పటికే హోర్డింగ్‌లో ఉండే పలు పలకలు ఊడిపోయి పడిపోయాయి. ప్రస్తుతం హోర్డింగ్‌లో ఉండే పలు ఇను ఊచలు తుప్పుపట్టి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి. సంబంధిత అధికారులు హోర్డింగ్ నిర్వాహకులతో మాట్లాడి దానిని తొలగించాల్సిన అవసరముందని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో శిథిలమైన భారీ హోర్డింగ్

బహిరంగ ప్రకటన

అందుమూలంగా తెలియచేయునది ఏమనగా నా క్లయింటు శ్రీ బందారు క్రిష్ణమ్మ గారి కుమారుడు బందారు శ్రీనివాస రావు, పోతనవలస, కె. కోటపాడు, ఎ. కోడూరు, విశాఖపట్నం వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం ప్రకటన.

నా క్లయింటు క్రింద తెలిపిన షెడ్యూలు ఆస్తిని దస్తావేజు నెం.6668/2021, తేది. 08.10.2021 తేదీన మధురవాడ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు ద్వారా క్రయము పొందిన శ్రీ నమ్మి హరికృష్ణ, తండ్రి. గంగారావు వారి వద్ద నుండి ఆస్తిని కొనుగోలు చేయుటకు సంసిద్ధులై ఉన్నారు. కావున క్రింద తెలిపిన ఆస్తిపై ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు గాని, తనఖాలు, ఛార్జీలు వగైరాలు ఏమైనా ఉన్నచో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌కి 14 (పద్నాలుగు) దినములలోగా లిఖితపూర్వకముగా మాకు తెలియపర్చవలెను. లేని యెడల తదుపరి వచ్చిన అభ్యంతరములు మా క్లయింటును బంధింపజాలవు.

షెడ్యూల్ : 185 చ॥గ॥లు ప్లాట్ నెం.134, బంగారుతల్లి నగర్ లే-అవుట్‌లో పట్టా నెం.23, సర్వే నెం.16/1, ధారపాలెం, ముడసర్లోవ గ్రామం, జివిఎంసి పరిధిలో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ సంబంధించిన ఆస్తికి హద్దులు : తూర్పు : 40 అ॥ల రోడ్డు, పడమర: ప్లాట్ నెం.135, ఉత్తరం : 30 అ॥ల రోడ్డు, దక్షిణం : గవర్నమెంట్ భూమి. తూర్పు దండె : 37 అ॥లు, ఉత్తరం దండె : 45 అ॥లు, పడమర దండె : 37 అ॥లు, దక్షిణం దండె : 45 అ॥లు.

యస్. నావాజ్, M.Sc., LLB; అడ్వకేట్
డో.నెం.49-48-19, NGGO's కాలనీ,
విశాఖపట్నం అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
తేది : 03.11.2024 ఫోన్ : 80740 46019